## కథ

# సొంత ఇల్లేకదా స్వర్గసీమ

**యల్లాప్రగడ సువర్చలాదేవి**

ఆ రోజు సుబ్బారావుకి ఏనుగెక్కినంత సంబరంగా ఉంది. దానికి కారణం ఏ ప్రమోషనో, ఇంక్రిమెంటో వచ్చినందుకో కాదు. అలాగే ఆఫీసుకు లేటుగా వచ్చాడనో, చిన్న చిన్న పనులు కూడా చేయటం రాదని బాస్ తిట్టనందుకో కాదు. కనీసం ఆ రోజు ఆయన ధర్మపత్ని ఆదిలక్ష్మి పండక్కి కొత్త చీర కొనమని అడగనందుకో లేక చిరంజీవి కొత్త సినిమాకి మొదటిరోజే తీసుకెళ్ళమని పిల్లలు అడగనందుకో కూడా అంతకన్నా కాదు. అంతకన్నా ఓ మధ్యతరగతి సగటు మానవుడికి ఇంకేం ఆనందాలు ఉంటాయి అనుకొంటున్నారా? ఆ సగటు మానవుడి ఆలోచనల కన్నా ఓ మెట్టు పై పైకి చూస్తే కనబడుతుంది. మీకు ప్రస్తుతం సుబ్బారావు కళ్ళ ముందున్న వార్త.

మీ సొంత ఇంటి కలలను సాకారం చేసుకోండి. ఇక పై మీరు కట్టబోయే అద్దె డబ్బులే మీకు సొంతింటిని సాధించి పెడ్తాయి

అదీ ఆ వార్త సారాంశం.

గృహ ఋణాలు ఇవ్వడంలో బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు పోటీపడుతున్న ఈ రోజుల్లో ప్రభుత్వమే ఒక రియల్ ఎస్టేట్ సంస్థలా మారి ప్రజలను ప్రోత్సహిస్తున్న ఈ రోజుల్లో ఇదో పెద్ద వార్తే కాదని మీ అభిప్రాయం కదూ! కానీ మన సుబ్బారావు లాంటి అమాయకులు మన దేశంలో ఉన్నంతకాలం, ఇలాంటి సంస్థలకు కొదవే లేదు. ఎప్పటికప్పుడు కొత్తగా అలాంటి వారిని ఆకర్షించడమే ఇలాంటి కంపెనీల ఉద్దేశ్యం.

ఇహ ఈ తాజా ప్రకటన సారాంశమేంటంటే, మీరు ఎలాంటి ఆదాయవర్గాల వారైనా ఇక పై నెల నెలా చెల్లించాల్సిన అద్దెని వారికి చెల్లిస్తే వారే మీ ప్రస్తుత ఇంటి అద్దె సంగతి చూసుకొని త్వరలో మిమ్మల్ని ఓ సొంతింటి వాళ్ళను కూడా చేసేస్తారు అదీ ఆ తాజా ప్రకటన లోని కొత్త స్కీము.

భాగ్యనగరంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తా మన సుబ్బారావు. భార్య ఆదిలక్ష్మి ఓ చిన్న ప్రైవేటు స్కూల్లో టీచరు. పిల్లలు ఇంకా హైస్కూల్‌కి రాలేదు. ఇంటి ఖర్చులకి ఒకరి జీతం, పండగ పబ్బం, ఇతర అవసరాలకి విలాసాలకి రెండో జీతం హాయిగా సాగిపోతూనే ఉంది. కానీ ఆఫీసులోనూ తెలిసిన సర్కిల్‌లోనూ అందరూ ఇళ్ళూ, స్థలాలు కొంటుంటే తను మాత్రం ఏం తక్కువ తిన్నాడు? తనూ కొనాల్సిందేనని ఈ మధ్య తెగ ఆవేశపడిపోతున్నాడు పాపం సుబ్బారావు. ఆ ఆవేశంలోనే ఈమధ్య ఎక్కడ అపార్ట్‌మెంట్ కడుతుంటే అక్కడికల్లా వెళ్ళసాగాడు. కానీ ఆ ధరలేవీ అందుబాటులో ఉన్నట్లు కనబడ్డం లేదు. పోనీ ధైర్యం చేసి ఏ అప్పోసప్పో పెట్టి కొందామనుకుంటే లేని పోని ఆర్థిక బాధలను ఆహ్వానించడం ఎందుకని పడనివ్వడం లేదు ఆదిలక్ష్మి. చివరికి అటు కర్రా విరక్కుండా, ఇటు పామూ చావని ఉపాయం ఇన్నాళ్ళకు గానీ దొరకలేదనిపించింది సుబ్బారావుకి ఈ ప్రకటన చూశాక. అదే ఆదిలక్ష్మికి చూపించడం, వప్పించడం అన్నీ జరిగిపోయాయి అనుకోకుండా. పాపం భర్త ఆనందాన్ని మాత్రం ఎందుకు కాదనాలి. పైగా కొత్తగా వచ్చి పడే ఖర్చు ఏమీ లేదు. ఆ అద్దె డబ్బేదో ఓనరుకి బదులు ఈ ఇల్లు కట్టించి ఇచ్చే వాడికిస్తే త్వరలోనే ఇంటి ఓనర్‌ని అవ్వొచ్చు. పాపం ఆదిలక్ష్మికీ ఆశ పుట్టింది. ఎందుకైనా మంచిది, కాస్త మంచీ, చెడూ చూసి దిగండి అంటూ ఓ సలహా కూడా పడేసింది.

నీకెందుకోయ్, ఇక నాకొదిలేసి నిశ్చింతగా వుండు అంటూ హుషారుగా ఫోన్ తీసి ఆ ప్రకటనలో ఇచ్చిన నెంబరుకు ఫోన్ చేసాడు. ఎంతో వినయంగా సుబ్బారావు అడిగిన ప్రశ్నలన్నిటికీ ఓపిగ్గా సమాధానమిచ్చాడు ఆ అవతల వ్యక్తి. అంతా విని తృప్తి పడ్డాడు సుబ్బారావు. వచ్చే ఆదివారమే ప్రకటనలో ఇచ్చిన స్థలాన్ని చూడటానికి ముహూర్తం నిర్ణయించారు. దగ్గరుండి సుబ్బారావుని సతీ సమేతంగా స్థలాన్ని చూపి తీసుకు వచ్చే బాధ్యత కూడా తమదే అనటంతో ఇంటిని సొంతం చేసేసుకున్నంత సంబరపడ్డాడు సుబ్బారావు.

ఎదురు చూసిన ఆదివారం రానే వచ్చింది. అనుకున్న సమయానికన్నా ముందుగానే ఓ అంబాసిడర్ కారు వచ్చి ఆగింది. వీళ్ళ పంక్చువాలిటీకి దండెయ్యా! అనుకొంటూ త్వరత్వరగా తయారయ్యి కారు వెనక సీట్లో దర్జాగా కూర్చొని బయలుదేరారు సుబ్బారావు దంపతులు.

ఏడయ్యా..మీ సూపర్ వైజర్? కాస్త చిద్విలాసంగానే అడిగాడు సుబ్బారావు డ్రైవరుతో.

ఆయన డైరెక్టుగానే వస్తారు సార్, కష్టమర్స్‌ని మాత్రం నేనే తీసుకెళ్తాను అన్నాడు మామూలుగా.

కష్టమర్స్ అంటున్నావ్, మేముగాక ఇంకెవరైనా ఉన్నారా? కాస్త కంగారుగా అడిగాడు సుబ్బారావు.


ఏదో కొద్దివుందే సార్ పళ్ళికిలించాడు డ్రైవరు. వాడి నవ్వులోనే అనేక భావాలు కనిపిస్తున్నా, సరే చూద్దాంలే అంటూ కాస్త ఆశావహ దృక్పథంతోనే ఆలోచించాడు సుబ్బారావు. అక్కడో జంట, అక్కడో జంట ఇలా ఓ పది జంటలని ఎక్కించాడు. ఎక్కించాడు అనడం కన్నా కుక్కాడు అనడం సబబుగా ఉంటుందేమో! కాకపోతే కష్టమర్స్‌కి డ్రైవర్ ఇచ్చిన కన్‌సెషన్ ఏంటంటే ఆడవాళ్లందరినీ వెనక సీట్లో కుక్కితే మగాళ్ళనందరినీ ముందు కొందరిని, డిక్కీ ఓపెన్ చేసి కొందరిని అడ్జస్ట్ చేశాడు.

ఎవడికొచ్చిన తిట్లు వాళ్ళు తిట్టుకొన్నారు. ఆడవాళ్ళ శాపనార్థాలు పెట్టారు. తన పక్కనున్న కొందరి మగాళ్ళ బండ బూతులకు సుబ్బారావే మొదట సిగ్గుపడి మెలికలు తిరిగినా, తనూ కాస్త వచ్చీ రాని తిట్లు తిట్టి తోటి మగవాళ్ళ మధ్యలో తనూ కాస్త గర్వంగా ఫీలయ్యాడు.

అయితే ఇవన్నీ తనకు మామూలే అన్నట్లు డ్రైవరు మాత్రం ఎప్పటిలాగే చిద్విలాసంగానే ఉన్నాడు. అంతే కాక దారిలో ఓ గంప, కాస్త లగేజీతో ఉన్న ఓ పల్లెటూరతనితో మాట్లాడి అతని లగేజీని కారు పైన కట్టి, అతనిని డిక్కీలోకి కుక్కాడు. తిక్కరేగిన ఓ పెద్ద మనిషి కోపం నషాళానికి అంటి కారు దిగబోయే లోపే ఒక్క ఉదుటున కారు కదిలించి ఊరి పొలిమేరలు దాటించేశాడు డ్రైవర్. ఇక జన సంచారం లేని ఆ నిర్మానుష్య ప్రదేశంలో డ్రైవరుతో గొడవ పెట్టుకొని చేసేది లేక అందరూ కుక్కిన పేనుల్లాగా కూర్చొన్నారు.

ఎంతో దూరం వెళ్ళాక అక్కడ రోడ్డు నుంచి లోపలికి చూపిస్తున్న ఓ బోర్డు, దానిపై వీళ్ళు వెళ్తున్న ప్రదేశం తాలూకా పేరు, వివరాలు చూసి వచ్చేశాం కదా అని కాస్త సంబరపడ్డాడు సుబ్బారావు. తారు రోడ్డు మీద ఆ ఇరుకు కారులో తెలియలేదు. కానీ గతుకుల మట్టిరోడ్డులో, లోపలికి ఓ పది కిలోమీటర్లు వెళ్ళేసరికి ఒళ్ళు హూనమయ్యింది అందరికి. ముఖ్యంగా డిక్కీలో కూర్చొన్న వారి పరిస్థితి మరింత అధ్వాన్నం, మట్టికొట్టుకుపోయి, జుట్టు రేగిపోయి ఒక్కొక్కళ్ళు రైసుమిల్లులో మూటలు మూసే కూలీల్లాగా తయారయ్యారు.

సార్ లొకేషన్ వచ్చేసింది, దిగండి అన్న డ్రైవర్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిన సుబ్బారావు తన ముందు ఓ అరడజను మంది దిగితే తప్ప, డోరు ఎక్కడుందో చూసే పరిస్థితి కనబడ్డం లేదు. ఆ తరువాత కాలు తీసి బయట పెడదామనుకొన్న సుబ్బారావుకి, కాలు స్పర్శ కోల్పోయి ఒక్కసారి తన కాలు లేదేమో అన్నంత భయమేసి చివరికి తన కాలు కనబడ్డంతో ఊపిరి పీల్చుకొన్నాడు. కానీ అంతసేపు కాలు కదల్చక పోవడంతో కాలు తిమ్మిరి పట్టి నడుస్తున్నా ఏమీ తెలియడం లేదు. మరో పక్క ఎవరెవరో ఆడ జనం దిగుతున్నా తన ఆదిలక్ష్మి మాత్రం కనబడకపోవడంతో కంగారు పడ్డాడు సుబ్బారావు.



చివరికి పది మంది దిగాక ఓ ఆడ మనిషి వచ్చి తనని పిలుస్తుంటే ఉండవమ్మా- మా ఆవిడని వెదుక్కోవాలి అంటూ తన ఆదిలక్ష్మికై గాలించాడు పాపం సుబ్రావ్.

ఏవండీ..మిమ్మల్నే.. తన భార్య పిలుపు వినబడి, ఇందాక కనబడ్డ శాల్తీ తప్ప ఎవరూ కనబడక పోవడంతో అయోమయంలో పడ్డాడు. చివరకు అలవాటైన తిట్ల దండకం విని గానీ ఆమే తన భార్య అని పోల్చుకోలేకపోయాడు పాపం సుబ్బారావు. అప్పటికే అందరూ వాళ్ళకు వచ్చిన తిట్లు తిట్టుకొంటూ ఆ ఖాళీ మైదానంలో ఎటో పోతుంటే ఇక తప్పిపోతామేమో అని గబగబా పెళ్ళాం చెయ్యి పుచ్చుకొని తనూ అటు వైపు వెళ్ళాడు సుబ్రావ్.

డియర్ కష్టమర్స్. హార్టీలీ వెల్కం. మీ జర్నీ బాగా జరిగిందని భావిస్తున్నాను అంటూ ఏదో మాట్లాడబోతున్న సూపర్వైజర్ని కొంతమంది తిట్లతో దాడి చేయబోగా ఒకరిద్దరు కొట్టబోయారు కూడా. శాంతంగా, చిరునవ్వుతో వారికెవ్వరికీ దొరక్కుండా తప్పించుకుంటూ- ఇప్పుడు మీకందరికీ మేము వెల్కం డ్రింక్ సప్లై చేస్తాము ని అక్కడి నుండి జారుకున్నాడు. ఇంతలోనే ఓ వ్యక్తి అక్కడున్న అందరికీ ప్లాస్టిక్ గ్లాసులలో అదేదో గులాబీ రంగు ద్రవాన్ని అందించాడు.

కొంతమంది ఫ్రీగా వస్తోంది కదా అని ఆబగా లాగించబోగా కొంత మంది మాత్రం నోట్లో పెట్టుకోగానే ఊసేసి ఏంటయ్యా ఇది అంటూ ఇస్తున్న వాడిపై గైమని లేచారు. ఇది కేరళ నుండీ తెచ్చిన ప్రత్యేక ఆయుర్వేద ద్రవం సార్..మీ అలసటని ఒక్కక్షణంలో మటుమాయం చేస్తుంది, గ్లాసు ఐదు రూపాయలే అంటూ అసలు విషయం బయట పెట్టేసరికి అందరూ నోళ్ళు బెట్టారు. ఇంతలో సూపర్ వైజర్ మీకు ఇంకా ఏదైనా కావాలంటే అక్కడ క్యాంటీన్ ఉంది, మీకు కావాల్సినవి మీరు కొనుక్కోవచ్చు అంటూ మెరుపులా మాయం అయ్యాడు. అప్పటికే ఎండలో గొంతెండిపోయి, దుమ్ము కొట్టుకుపోయి, నలిగిపోయి అలసిన అందరూ పోలోమంటూ క్యాంటీన్ మీద పడ్డారు. అక్కడ వాళ్ళకి వాకిట్లోనూ, అక్కడక్కడా కొందరు పహిల్వాన్ లాంటి వాళ్ళు కనబడ్డారు. వాళ్ళెందుకో ఇక్కడ! బహుశా ఈ స్థలానికి సెక్యూరిటీనేమో! అనుకొని లోపలికి వెళ్ళిన జనాలకి మినరల్ వాటర్ బాటిళ్ళు, తిండిపదార్థాలు, టీ, కాఫీ, టిఫిన్లు అన్నీ కనబడ్డంతో ఒక్కసారిగా సోమాలియాలోని కాందిశీకుల్లా వాటి మీద పడ్డారు.

కానీ అంతా అయ్యి బిల్లులు చూసేసరికి ఒక్కొక్కరికి కళ్ళు బైర్లు కమ్మాయ్. మినరల్ వాటర్ బాటిళ్ళు ఇరవై రూపాయలు, కాఫీ, టీలు పది రూపాయలు, ఇడ్లీ సాంబార్ ఇరవై రూపాయలు, చిన్న సైజు స్టార్ హోటల్ ధరలు ఉన్నాయి అక్కడ.

ఇక్కడింతే సార్, బోర్డు చూళ్ళేదా అంటూ చిద్విలాసంగా ధరల బోర్డుని చూపించాడు హోటలు ఓనరు. చేసేది లేక భారంగా బిల్లు చెల్లించి బయట పడ్డారు సుబ్బారావు దంపతులతో సహా అక్కడకొచ్చిన అందరూ. చివరికి అందరినీ ఓ రెండు కిలోమీటర్లు నడిపించి ఇదేనండీ మీరు ఉండబోయే మీ సొంతిళ్ళ సముదాయం అంటూ అక్కడ సున్నపు గీతలను చూపిస్తూ ఆ ప్లాట్ల వివరాలు, అవీ చెప్తున్నాడు సూపర్వైజర్. పాపం సుబ్బారావుకి ఉత్సాహం అంతా నీరుగారిపోయింది. ఏమన్నా అడుగుదామంటే సూపర్వైజర్ మిగతా వాళ్ళతో తెగ మాట్లాడుతూ బిజీగా కనిపించాడు.

ఉన్నవాళ్ళు ఉండక ఇప్పుడు మనకీ ఎందుకొచ్చిన గోల ఇది అంటే వినిపించుకోకుండా ఇక్కడెక్కడికో తీసుకొచ్చారు. ఇది భాగ్యనగరమా? దీన్ని చూస్తాంటే ఇదీ హైదరాబాదుకి దగ్గరున్నట్లు లేదు, ఏ విజయవాడో, బెంగుళూరుకో దగ్గరలా ఉంది విసుక్కొంది ఆది లక్ష్మి.

అప్పటికే నీరు కారిపోయిన సుబ్బారావు ఎలాగోలా అక్కడున్న వాళ్ళతో ఓ అరగంట కుస్తీ పట్టి చివరికి సూపర్‌వైజర్‌తో మాట కలప గలిగాడు.

ఏంటి సార్ మీ ప్లాట్ చూసుకొన్నారా? ఈస్ట్ ఫేసింగా, వెస్టా? మీరు ముందు కార్నర్ ప్లాటు బుక్ చేసుకోండి, వాంఛి వ్యూ ఉంటుంది హుషారుగా అన్నాడు సూపర్‌వైజర్.

ఈస్టా, వెస్టా అసలేముందయ్యా ఇక్కడ...కనుచూపు మేరలో చూద్దానికి ఏమీ లేదు! ఏం చూడమంటావ్? చిరాగ్గా అడిగాడు సుబ్బారావు.

భలే వారు సార్..మీరు నిలబడింది దేని మీద అనుకొన్నారు? మట్టి కాదు, బంగారం మీద అన్నాడు చిద్విలాసంగా సూపర్‌వైజర్.

ఒక్కసారి ఉలిక్కిపడి బంగారమా! అదెక్కడ? అన్నాడు పక్కకి గెంతుతూ కంగారుగా సుబ్బారావు.


భలే వారు సార్ మీరు, భలే జోకులేస్తారు అంటూ సుబ్బారావు భుజం తట్టాడు సూపర్‌వైజర్. ఆ దెబ్బకి ముందుకి తూలబోయి నిలదొక్కుకొని కోపంగా చూశాడు సుబ్బారావు. అవేవి పట్టనట్లు మీరు ఇవాళ ప్లాట్ బుక్ చేసుకొని రేపు పేపర్లో అమ్మకానికి పెడితే రెట్టింపు ధర పలుకుతుంది సార్. అంత డిమాండ్ ఉంది ఈ స్థలానికి. అటు చూడండి ఆ మూల..ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కట్టబోయేది అక్కడే. ఈ పక్క హార్డ్‌వేర్ పార్క్, అటు పక్క బయోటెక్నాలజీ ఇండస్ట్రీ, ఇహ ఈ పక్క అన్నీ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఎవరితోనూ అనకండి సార్ మొన్ననే ప్రభుత్వం ఓ అంతర్జాతీయ కార్ల కంపెనీకి కార్ల పరిశ్రమ పెట్టుకోడానికి ఇక్కడే ల్యాండ్ ఇచ్చిందట సార్. ఇక అదొచ్చిందంటే ఎప్పుడు మార్కెట్‌లోకి ఏ కొత్త కారు వచ్చినా మొదట మీ కాంపౌండ్‌లోనే అదుంటుంది చెప్పుకుంటూ పోతున్నాడు సూపర్‌వైజర్ మహా ఉత్సాహంగా.

ఆ కారు కొనే స్థోమతే ఉంటే ఊరికి దూరంగా ఇక్కడ ఇంటికోసం నేనెందుకు వస్తాను, ఇక ఈ హార్డ్ వేర్ పార్కులు, సాఫ్ట్‌వేర్ పార్కులు నాకెందుకు? అయోమయంగా అడిగాడు సుబ్బారావు.

ఇప్పుడు మీకు కారు కొనే స్థోమత లేకపోయినా ఈ స్థలం కొన్న తరువాత మీకు ఆ స్థోమత దానంతట అదే వస్తుంది సార్. రేపు మీ పిల్లలు ఉద్యోగాలు చేసేది ఈ కంపెనీల్లోనే కదా సార్! ఇక వాళ్ళు ఉద్యోగాల కోసం ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు అంటూ ఇంకా అక్కడే ఉంటే, సుబ్బారావ్ నుండి ఎలాంటి క్లిష్ట ప్రశ్నలు వస్తాయో అని ఇప్పుడే వస్తాను అని చెప్పి మరో జంటకి ఇదే రికార్డు వేయడంలో నిమగ్నమయ్యాడు సూపర్‌వైజర్.

## మావారు మంచి వంటాయన

భర్తలు గరిటె తిప్పితే ఆ ప్రత్యేకతే వేరు కదా! ఇక సినిమా హీరోయిన్ల భర్తలు, అందునా తెరపై హీరోలుగా నటించేవాళ్లు అద్భుతంగా వంట చేస్తారంటే విశేషమే మరి! కాజోల్ తన భర్త అజయ్ దేవ్‌గన్ పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని తెగ పొగుడుతుంది. నిజానికి తనకి వంట చేయడం అంతగా రాదుట. కానీ తన భర్త మాత్రం బ్రహ్మాండంగా నోరూరించే వంటకాలు అలవోకగా చేసిపారేస్తాడని గొప్పగా చెబుతోంది. చైనీస్, మొఘలాయ్ వంటకాలు సైతం అద్భుతంగా వండిపెడతాడు అజయ్ అని మురిసిపోతోంది కాజోల్.



ఏమండీ మన ఇంటి పక్కన ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పడగానే మనం ఎంచక్కా స్విట్జర్లాండ్ వెళ్ళొద్దామండి అంటూ గారాలు పోతోంది ఆ భార్య. అది వింటూనే పగటి పూటే కనిపిస్తోన్న చుక్కలను లెక్కపెట్టసాగాడు ఆ సదరు భర్త అనబడే శాల్తీ.

మళ్లీ ఓ గంట సేపు కుస్తీపడితే గానీ ఆ సూపర్‌వైజర్ని పట్టుకోలేకపోయాడు సుబ్బారావ్.

అవన్నీ సరే గానీ మేము ఎంత కాలం మా అద్దె మీకు కట్టాలి? ఎప్పటికి ఈ ఇల్లు మా సొంతమవుతుంది? ఆశ చావక చివరగా అడిగాడు సుబ్బారావ్.

దాందేముంది సార్ పదిహేను, ఇరవై, ఇరవై ఐదు ఏళ్ళు ఇలా రక రకాల స్కీములున్నాయి. కొత్తగా రిటైర్‌మెంట్ స్కీము కూడా పెడుతున్నాం. అంటే మీరు రిటైర్ అయ్యే వరకూ కూడా ఇన్‌స్టాల్‌మెంట్ కట్టుకోవచ్చు ఎంతో ఉత్సాహంగా, ఏదో రహస్యం చెప్తున్న వాడిలా మాట్లాడాడు సూపర్‌వైజర్.

ఏడ్చినట్టుంది. అంత కాలం అద్దె కట్టే కాడికి ఇక్కడుండటమెందుకు? హాయిగా సిటీలోనే ఉండొచ్చు కదా! పైగా అక్కడైతే పిల్లలకి, మా ఆవిడకి స్కూలు, నాకు ఆఫీసు, మా ఇంట్లో అందరికీ షాపులు, మార్కెట్లు, దేవాలయాలు, సినిమా హాళ్ళు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు అన్నీ దగ్గర, ఇక్కడేం చేస్తాం? అన్నాడు విసుగ్గా సుబ్బారావ్.

ఇక్కడ అన్నీ వచ్చేస్తాయ్ సార్, ఆ తర్వాత ఇక్కడ దొరకనివంటూ ఏమీ ఉండవు. మా ఆఫీసు రూం పక్కనే ఓ గుడి కట్టబోతున్నాం. మా వాడొకడు ఇక్కడే ఓ స్కూల్ పెట్టబోతున్నాడు. ఇక మా పార్ట్‌నర్ ఫ్రెండొకతను సూపర్‌బజార్ కూడా పెట్టబోతున్నాడు. ఉప్పు, పప్పు, దేనికోసం వెతుక్కోనక్కరల్లేదు. ఇక ప్రయాణాలకంటారా...ఇక్కడ నుండీ ఓ రెండు కిలోమీటర్లు నడిస్తే అక్కడ మా ఆఫీసు వస్తుంది. అక్కడికి రోడ్డు కూడా వేసేస్తారు

ఏదీ ఆ మట్టి రోడ్డేనా? కోపాన్ని పళ్ళబిగువన పెట్టి అన్నాడు సుబ్బారావ్, ఇందాక ఆ రోడ్డులో వచ్చిన జనాల అవతారాలను గుర్తుచేసుకొంటూ.

అవును సార్...అక్కడికి ఆటోలూ, రిక్షాలూ వస్తాయి. ఇక అక్కడి నుంచీ జస్ట్ ఓ పది

కిలోమీటర్లు వెళ్ళారంటే మెయిన్ రోడ్ వచ్చేస్తుంది

ఏంటీ..రోజూ పది కిలోమీటర్లు రిక్షాలో, అదీ ఆ మట్టిరోడ్డుపై వెళ్ళాలా? దాదాపు కొట్టటానికి వెళ్ళినట్లుగా అరిచాడు సుబ్బారావు.

సార్..మీరలా అడ్డమొస్తే నేను చెప్పను బుంగమూతి పెట్టాడు సూపర్‌వైజర్.

సుబ్బారావుకి చిర్రెత్తుకొచ్చి జుత్తు పీక్కొన్నాడు. అది చూసి కిసుక్కున నవ్వి మళ్లీ చెప్పసాగాడు సూపర్‌వైజర్.

మీకు రిక్షా నచ్చలేదనుకోండి ఈ కాలనీ వాళ్ళందరూ కలిసి ఓ వ్యాన్ వేసుకోవచ్చు, లేదా ఆర్టీసీ వాళ్ళకి ఓ పిటీషన్ పడేస్తే బస్సే వచ్చేస్తుంది. అయినా ఈ లోపే కార్ల ఫ్యాక్టరీ రాదుటండీ..ఆ తర్వాత ఇక మిమ్మల్ని ఆపే వాడు ఉండడూ చిద్విలాసంగా అన్నాడు సూపర్‌వైజర్.

అయినా కార్ల కంపెనీ వస్తే మాకేంటీ? దానితో మా సమస్యలు ఎలా తీరతాయి? అయోమయంగా అడిగాడు సుబ్బారావు.

భలేవారు సార్. ఆ కార్ల కంపెనీలో మీకు చవకగా కార్లు ఇప్పించే బాధ్యత నాదీ. మా బాబాయి కొడుకు ఒకతను ఆ కంపెనీలో జాబ్‌కి ట్రై చేస్తున్నాడు. ఆ కంపెనీ అక్కడ పెట్టేలోపు వాడు ఆ కంపెనీలో చేరడం, ఇక ఆ తర్వాత అంతా మనదే రాజ్యం చాలా తేలికగా చెప్పాడు సూపర్‌వైజర్.

ఈసారి సుబ్బారావుకి కోపం తెచ్చుకోనే ఓపిక లేక నిస్సహాయంగా భార్య వైపు చూసి అప్పటికే తనను తినేలా చూస్తున్న ఆదిలక్ష్మి భద్రకాళి లాగా కనపడటంతో భయమేసి కాస్త జంకాడు.

సార్ మీరు త్వరగా మా ఫ్లాట్ బుక్ చేసుకొంటే కన్సెషన్‌తోపాటు లక్కీ డ్రాలో మీకు ఏదో ఒక బహుమతి వచ్చేలా చేస్తాను ఆ తర్వాత మీ ఇష్టం అన్నట్లు చెప్పాడు సూపర్‌వైజర్.

ఒక్క నిమిషం అని భార్య దగ్గరికి వెళ్ళి, ఎవ్వరూ చూడకుండా చేతులు పట్టుకొని ఏం చేద్దాం? అడిగాడు భయంగా. చుట్టూ జనం ఉండటంతో ముందుగా కోపంగా చూసి ఇంటికెళ్ళడానికి ఏర్పాట్లు చేయమనండి అంది ఆదిలక్ష్మి కటువుగా.

అమ్మయ్య అనుకొంటూ మేము ఇంటికెళ్ళి ఆలోచించుకొని చెప్తాము. మీ కారుని పిలిపిస్తే మేము వెళ్ళాలి అన్నాడు సుబ్బారావ్ కాస్త తన భావాలని బయటకి కనబడనీయకుండా ప్రయత్నిస్తూ.

ఇంత మాట్లాడి చివరకు నువ్వనేది ఇదా! అసలు ఇది కొనే బేరమేనా? అన్నట్లు ఎగాదిగా చూసి దానికి కాస్త టైం పడుతుంది అని చెప్పి గుంపులోకెళ్ళి మాయమయ్యాడు సూపర్‌వైజర్.

పెళ్ళాం చేత తిట్లు తింటూ రెండు కిలోమీటర్లు నడిచి నాలుగు గంటలు ఎదురుచూసి ఓ కుక్కల బండి లాంటి వాహనంలో ఓ డెబ్బై, ఎనభై మంది మధ్య ఇరుక్కొని అర్ధరాత్రికి ఇంటికి చేరారు సుబ్బారావు దంపతులు. అర్ధరాత్రి మునిసిపాలిటి వ్యాను వచ్చిందేం అని చూసిన ఇరుగు పొరుగు వాళ్ళకి కనబడకుండా ఇంట్లో పడ్డారు సుబ్బారావు దంపతులు ఎట్టకేలకు. కానీ కనబడ్డా వాళ్ళని ఎవరూ గుర్తుపట్టలేనట్లు ఉన్నారని ఇంట్లో అద్దం చూస్తే గాని అర్థమవలేదు ఆ దంపతులకి.

ఆ తర్వాత ఇంకెప్పుడూ ఊరవతల సొంత ఇల్లు అనే మాట సుబ్బారావ్ నోటి వెంట రాలేదు. ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళ వరకూ మొగుడ్ని తిట్టిన ఆదిలక్ష్మి ఎట్టకేలకు తన మొగుడు మాత్రం ఏం చేస్తాడులే అని ఊరుకొంది కొన్నాళ్ళకు.

కొన్ని నెలల తర్వాత పేపర్‌లో వచ్చిన ఓ వార్తను చూసి మాత్రం మనసులో కసిగా నవ్వుకొన్నాడు సుబ్బారావ్. ఆ వార్త సారాంశం ఏమిటనగా కొన్ని నెలల క్రితం సుబ్బారావ్‌ని అష్టకష్టాల పాలు చేసిన సంస్థ సరైన పద్ధతులు పాటించకుండా, సరైన నిజా నిజాలు చెప్పకుండా ప్రజలను మోసం చేస్తోందని, దాంతో పోలీసులు ఆ సంస్థ నడిపే వ్యక్తులందరినీ జైల్లో వేసి, ఆ సంస్థని మూసేసారని.

## హీరోగారి కోసం...?

ఓ తమిళ చిత్రంలో కేవలం ఒక్క పాటలో వడివేలుతో కలిసి డాన్స్ చేయ దానికి శ్రియకి పాతిక లక్షలు ముట్టిన వార్త ఇటీవలే విన్నాం కదా. శ్రియకి సంబంధించి ఇలాంటిదే మరో సంగతి కోలీవుడ్‌లో షికార్లు చేస్తోందిప్పుడు. శింబు హీరోగా నటించే ఓ సినిమాలో నటించడానికి శ్రియకి ఏకంగా 65 లక్షలు పారితోషికం ఇవ్వడానికి ఆ చిత్ర నిర్మాత రెడీ అయ్యాడట. అసలు సంగతేంటంటే- ఎలాగైనా ఈ సినిమాలో శ్రియనే హీరోయిన్‌గా తీసుకోవాలని హీరో శింబు కండిషన్ పెట్టడంతోనే నిర్మాత ఇంత మొత్తం ఇవ్వడానికి వెనకాడలేదని సినీ జనాలు గుసగుసలాడుకుంటున్నారు.

